# పావులు

ఆకాశంనుండి మంచు రంపపు పొట్టులా జలజలా రాలుతోంది. చలిగాలికి గుడారాలు జివ్వున ఊడుకుపోతున్నాయి. శరీరాలపై పడవేసి కొన్న రగ్గుల క్రింద వణికిపోతున్నారు సైనికులు, నరాలన్నీ ఎక్కడికక్కడ బిగిసిపోతున్నాయి. ప్రేగులు దొమ్మకొనిపోసాగాయి.

అంధకారం ఇంకా ఆవులిస్తూనే ఉంది.

ఆ చలి గుబుళ్ళను చీలుస్తూ 'కమాండర్' ఉత్తర్వులు వినిపించాయి. బండబూతులు తిట్టుకొంటూ రగ్గులను అవతలకు నెట్టిపారవేశారు. గబ గబా కాళ్ళు బూట్లలో దూర్చుకొని సరంజామా అంతా తగిలించుకొని 'టక్ టక్' మంటూ మైదానంవైపు పరుగెత్తారు.

శిలా ప్రతిమలను మైదానంపై ప్రతిష్ఠించినట్లు ఎక్కడివారక్కడ చలన రహితంగా నిలబడ్డారు ఐదు నిముషాలసేపు. ఆ తరువాత లయబద్ధంగా అడుగులు వేసికొంటూ క్రమ పద్ధతిలో చేతులు కదులుస్తూ కవ్వాతు చేశారు. శరీరం హూనం హూనం అయిపోసాగింది.

మోకాళ్ళపై తొండలా ప్రాకుతూ. శత్రువుదృష్టిని తప్పించుకొంటూ కాల్పులు సాగించుతూ ముందుకు చొచ్చుకుపోయే ఎత్తుగడ.

వీపుపై వేలాడుతున్న కిట్.

రెండు చేతుల్లోనూ ఎక్కుపెట్టుకొన్న తుపాకి. శత్రువు గుండెను చీల్చి నెత్తురు చిందించటానికి పొంచుతూ ముందుకు పోతోంది. తల నుండి చెవుల ప్రక్కగా జారిన స్వేదజలం. ఉప్పగా పెదవులను తాకుతోంది—నరాలను జివ్వుమనిపించే చలిగాలి. దానిని అధిగమించేలా శరీరాల్లో విపరీతమైన వేడి.

చెమటతో తడిసిన బట్టలు ఎర్రమన్ను పులుముకొంటున్నాయి.

శక్తి క్షీణించి కళ్ళముందు చీకట్లు కమ్ముతున్నాయి. మోకాళ్ళు శరీరాన్ని ఈడ్వలేక వణికిపోతున్నాయి.

పైకి లేవటానికి అనుజ్ఞ లభించింది.

బిలబిలమంటూ లేచి నిలబడ్డారు. శరీరంలోని కండరాలన్నీ కైమా కొట్టినట్లు నుగ్గు నుగ్గయిపోయ్యాయి. 'అహా' అంటూ ఒళ్ళు విరుచుకున్నారు. మట్టికొట్టుకొన్న బట్టలు దులుపుకోవాలన్న ధ్యాస ఎవరికీ లేదు. తేలిపోతూన్న కాళ్ళను అదుపులో పెట్టుకొంటూ క్రమం తప్పని చీమల బారులా శిబిరంవైపు దారితీశారు.

సూర్యుడు గుట్టల వెనుకనుండి తొంగిచూస్తున్నాడు. తెల్లని తెరలా ఉన్న పొగమంచును చీల్చుతున్నాయి అతని కిరణాలు. ఆ వెలుగు చారికలు కోణాలు, కోణాలుగా నేలను తాకుతున్నచోట శత్రు స్థావరాలు దోమ తెరల్లా చెల్లా చెదురుగా ఉన్న డేరాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

వాటిని అలవోకగా చూస్తూ కాళ్ళీడ్చుకుంటూ గుడారాలు సమీపించారు - కేకలు వేసికొంటూ చెల్లాచెదరగా ఎవరి డేరాల్లో వాళ్ళు దూరారు-గుంపులు-గుంపులుగా నికెల్ కోటింగు వేసిన ప్లేట్లూ - జగ్గులూ చేతబట్టుకొని బయటికి పరుగెత్తారు.

బూట్లు దబదబమని శబ్దం చేస్తున్నాయి.

వరసగ్గా నిలబడిన వాళ్ళ ప్లేట్లలో చపాతీలు విసురుగ్గావచ్చి పడ్తున్నాయి. మట్టిక్షంపు కొడ్తూన్న సాంబారు జగ్గుల్లో నురగలు గక్కుతోంది.

సగం క్షడుక్కున్న పాచి ముఖాలతో ఆవురావురుమంటూ రొట్టెలు విరుచుకొని నోళ్ళలో కుక్కుకోసాగారు. ఆకలిగొన్న అడవిమృగం తన ఎరను కాళ్ళమధ్య జాగ్రత్తగా పొదవి పట్టుకొని మెడ ప్రక్కకు వాల్చి త్వర త్వరగా తింటున్నట్లు - ఘుఖం వాచినట్లు తినసాగారు.

రైల్వే కాంటీన్‌లో అప్పుడే రైలు ఎక్కవలసిన ప్రయాణీకుల్లా ఎడం - ఎడంగా-ఎక్కడివాళ్ళు అక్కడ నిలబడి తినసాగారు.

చెమటతో తడిసిన కాకి చొక్కాలు గాలికి ఎండిపొయ్యాయి - ఆ ఉప్పు పేరుకొనిపోయినచోట తెల్లని పొడలు - మాటాపలుకు లేకుండ నోళ్ళు మేత మేస్తున్నాయి.

'ధాం' అంటూ గుండు పేలింది.

అగ్నిగోళం బద్దలయినట్లు-చెవులు దిబ్బెళ్ళు పడిపొయ్యేలా భయంకరమైన శబ్దం - భూమి బద్దలై పెచ్చు పెచ్చులుగా రాలి పొరలు విరజిమ్మింది. మేఘంలా ఎర్రదుమ్ము ఇంతెత్తున ఎగసిపడింది.

కళ్ళనిండా దుమ్ము.

తిండి కలుపుకుంటూన్న కంచాలనిండా మన్ను.

'సర్-సర్'మంటూ గ్రినేడ్ ఒకటి వచ్చిపడింది - రెప్పపాటులో మానవ శరీరాలను ముక్క చెక్కలుగా నరికి విసిరిపారేసే గ్రినేడ్ - లక్ష్యంతప్పి చెంతనున్న సరస్సులో పడిపోయింది.

చెవులు గింగుర్లు మనేలా 'విజిల్' వినిపించింది.

తింటూన్న తిండి చేతబట్టుకొని అందరూ చెల్లా చెదరుగా పరుగెత్తారు. దబ దబా మంటూన్న బూట్ల శబ్దం - ఎంగిలి కంచాలు విసిరివేసిన చప్పుడు - అణగిపోతూన్న దుమ్ములో - తుపాకులతో సంకుల సమరానికి సన్నద్ధులై బారులు తీరుతున్న సైనికులు. అందరి ముఖాల్లోనూ భయం-ఆందోళన-కోపం రంగులు మార్చుకొంటున్నాయి.

"నీవింకా మింగుతూనే ఉన్నావా?...తిండిబోతు వెధవ...నడువ్-బద్మాష్..." కమాండర్ గర్జన.

తింటూన్న సైనికుడు తల పైకెత్త లేదు.

కచ్చా పచ్చాగా నమిలిన ముద్దలు గొంతులోనే ఉన్నాయి. బలవంతాన గుటకలు మ్రింగి లోనికి నెట్టేసరికి గుడ్లలో నీరు తిరిగింది. ధూళీ ధూసరితమైన ఆ సాంబారును గటగటా పీల్చిపారేశాడు. ఎంగిలి చేతులు కాకి పంట్లాంకు రుద్దుకొంటూ పరుగెత్తి తన తుపాకి అందుకొని మైదానంలోకి వచ్చాడు,

"ఆగు - అక్కడ - సైనికుడనని చెప్పుకోటానికి సిగ్గుపడాలి- నీలాటివాడు యుద్ధంలో చేరటం అనవసర—బద్మాష్..."

శిలలా నిలబడిపొయ్యాడు సైనికుడు - కటువైన కమాండర్ తిట్లు అతని హృదయానికి గుచ్చుకొన్నట్లు తల మరింత వాలిపోయింది. ఎదురు చెప్పకూడని సైనిక శిక్షణ అతని కంఠాన్ని తాడులా బిగించింది.

కమాండల్ ముఖం కందగడ్డలా మారిపోయింది. కళ్ళు విస్ఫులింగాలు వెదజిమ్ముతున్నాయి. కోపంతో రెండు పెదవులూ గట్టిగా కరుచుకుపోయి కోరమీసం మరింత వంకర తిరిగింది.

అందరి చేతులూ ఆయుధాలు పట్టుకొన్నాయి - మోర్టార్లూ - గ్రినేడ్లూ-చేతిబాంబులూ.

అందరి కళ్ళూ శత్రువుని వెదకుతున్నాయి.

శత్రువు అలికిడి లేదు—ముందుకు చొచ్చుకు వస్తూన్న సూచనలు లేవు, పారిపోతూన్న ఆనవాళ్ళు అసలే లేవు.

కళ్ళు గుచ్చి గుచ్చి చూస్తున్నాయి-గ్రినేడ్ వచ్చిపడిన దిశగా,

'కుక్కల కొడుకులు-దమ్ములుంటే ఎదురుగా నిలబడి పోరాడాలి. చాటుమాటునుండి బాంబులు విసరటం-పిరికితనం కాకపోతే మరొకటి కాదు..." తనలో తాను గొణుక్కున్నాడు కమాండర్-పైకి వినిపించేలా.

"ఇది శత్రువుల కవ్వింపుచర్య - గత రెండు రోజులుగా మనం చూస్తున్నదే! మనం అప్రమత్తులమై మెలగాలి - శత్రువులను రెచ్చగొట్టి యుద్ధానికి పురిగొల్పుతున్నారు - వాడు మన పరిధుల్లోనే మనలు

తున్నాడు - ఇచ్చా - వాడిక్కడినే ఎక్కడో పొదలచాటున దాక్కొని ఉంటాడు—సరిహద్దులు దాటి మన భూభాగంలోకి చొచ్చుకువచ్చి ఇంత ధైర్యంగా గ్రినేడ్ విసిరాడు—గ్రినేడ్ విసిరి పారిపోవటం అసంభవం - ఒకవేళ పోయినా ఒక వందగజాలు పరుగెత్తుతాడు-వాడ్ని తరిమి పట్టుకోవాలి"—పెదవులు బిగించుకొని చేతులు వెనక్కి విరిచి కట్టుకున్నాడు. ఛాతి మరింతగా పైకి ఉబికింది.

కనుసైగతో ఆజ్ఞాపించాడు.

"టక్ – టక్" మంటూ ఆరుగురు సైనికులు గోడలా ముందుకు కదిలారు.

"ముగ్గురటు - ముగ్గురిటు" - వెళ్ళవలసిన దిక్కులు చూపింది అతని వేలు. సాయుధులైన సైనికులు ఆ వేలు చూపిన దిశగా పరుగెత్తారు. పొదలమాటున అదృశ్యమయిపోయ్యాయి వాళ్ళ శరీరాలు.

"నీవు ఆలస్యంగా వచ్చినందుకు శిక్ష"- అతనికేసి చూపు మరల్చాడు.

ఆ సైనికుని కంఠరాలు బిగుసుకున్నాయి. కళ్ళు శిక్షను నిరీక్షిస్తూ నిస్సహాయంగా కమాండర్‌కేసి చూస్తున్నాయి. అతని దృష్టిపథంనుండి తప్పుకోటానికి కాళ్ళు రెడీగా ఉన్నాయి.

"ఆ కొలనులో పడ్డ గ్రినేడ్...అక్కడెక్కడో తేలుతోంది-అది ఏదేశానికి చెందిందో. దాని వివరాలు మనకు చాలా అవసరం - పో దాన్ని తీసుకురా" -అటుచూపెడుతూ అన్నాడు.

చలికి ముసుగడ తీసుకుపోయినట్లు అచంచలంగా ఉంది సరస్సు - గండశిలలతో వికృతమైన ముళ్ళ పొదలతో పరివేష్టితమై ఉంది - వాలూ పంకా లేకుండ.

సైనికుడు తుపాకి తీసికొని ముళ్ళ పొదలలో అదృశ్యమయ్యాడు. బూటు అనిసచోట పెల్లలు పెల్లలుగా ఎర్రమన్ను రాలిపోతోంది. బాధగా

భయంగా బోట్లు దారిని ఊహించుకొంటున్నాయి. బూట్లలో దాక్కున్న కాళ్ళు వణకుతున్నాయి - మంచుతో తడిసిన బండలు జారుతున్నాయి. పట్టు చిక్కని చేతులు మొండిగా నిస్సహాయంగా తచ్చాడుతున్నాయి. పట్టుకోసం - చేతివేళ్ళు కొంకర్లుపోయి, గడ్డకట్టుకొన్న నెత్తురు జివ్వుమంటోంది.

"ఉస్సు"రంటూ లేచి నిలబడ్డాడు - బండపై.

తరగ వలసిన దూరాన్ని అలసిన కన్నులు నిరీక్షిస్తున్నాయి. బారుగా ఉన్న కొండల శ్రేణిపై తమ స్థావరాలు. వాటికి దిగువ భాగంలో అడవి తుప్పలు- వాటికీ ఇంకా క్రింద లోయలు - మైదానం - దానికి తూర్పుప్రక్కగా సరస్సు - సరస్సు ఆవల మళ్ళీ పర్వతశ్రేణి. ఆ శ్రేణిపై శత్రు శిబిరాలు - పొగమంచులో లీలగా అస్పష్టంగా గస్తీ దళాలు కదుల్తున్నాయి.

వంగుతూ. దేకుతూ ప్రాకుతూ పొదల మధ్యగా దారి వెతుక్కో-సాగింది ఆతని శరీరం - రక్కసి ముళ్ళపొదలు శరీరంలోకి కసిగా దిగుతున్నాయి,

మెల్లమెల్లగా కొలను దగ్గరకు జరిగింది.

మనస్సు తేలికపడింది,

బండచరియల్లా దాక్కున్న సరస్సు - నల్లని నీటిశోభ భయంకరమైన లోయలు దాచుకున్న కొలను - పైనుండి చూస్తే మడుగులా కనిపిస్తూ మోసగిస్తూన్న కోనేరు.

పచ్చగా పాచిపట్టిన ఎత్తైన పెనుబండలు - నీళ్ళలోనుండి తొంగి చూస్తున్నాయి,

చేతులూ కాళ్ళూ ఆడించడానికి వీలులేని కొండ చరియలు,

వెనుతిరిగి కళ్ళు పైకెత్తి తన శిబిరంకేసి చూశాడు, అతని చూపులు సహాయాన్నర్థిస్తున్నాయి,

కమాండర్ లేడు - సైనికులు లేరు - మైదానమంతా నిర్మానుష్యంగా ఉంది - గుడారాలు మాత్రమే తెల్లగా కనిపించుతున్నాయి.

నిస్సత్తువగా అతని భుజాలు వాలిపోయ్యాయి, భుజాన వేలాడుతున్న తుపాకితీసి క్రింద పెట్టాడు. గబ్బగా బట్టలు విడిచి, వాటిపై తుపాకి బరువుగా పెట్టాడు.

ఎముకలు కొరికే చలి.

గజగజలాడిపోసాగింది శరీరం. బండ అంచునుండి చేతులు ముందుకుచాచి నీళ్ళలో దూకాడు. చేతులు వడివడిగా ఆడిస్తూ గ్రినేడ్‌వైపు పురోగమించాడు.

కొండలోయలోనుండి "హోరు" మని బయలుదేరి ఆ సరస్సును చుట్టివేయసాగింది - ఈదురుగాలి. నిశ్చలమైన సరస్సులో తరంగాలు కదిలాయి. అలలు మోసుకెళ్తున్న దిశగా సునాయాసంగా కదల్తూ పోసాగింది గ్రినేడ్.

నీటితో నీరు ఉమ్ముకొంటూ శరీరాన్ని ఈడ్చుతున్నాడు నీటిపైన.

తేలిపోతూన్న అతని కనుపాపల్లో బండలమాటుకు పోతూన్న గ్రినేడ్ - అత్యంతవేగంగా ముందుకుసాగి ఒక్క ఉదటున దాన్ని చేజిక్కించుకొన్నాడు. దానిని పళ్ళతో కరచి పట్టుకొని వెనుతిరిగాడు. ఈదవలసిన దూరం నిస్పృహ కలిగించింది. శరీరం అలసిపోయి ఆయాసంతో రొప్పసాగాడు. మరో దిశగా మళ్ళాడు.

గుహలు - గుహలుగా బండలు పేరుకొన్నాయి,

సూర్యరశ్మి చొరరాని ఆ సొరంగాల మధ్యనుండి ప్రవహిస్తున్న నీటిజాలు - పెరిగిననాచుతో అల్లుకుపోయిన తామరతీగెలాటి పిచ్చితీగె - తీగెమధ్యలో చిక్కుకుపోయిన చేతులు - కదిలించటానికి వీలులేకుండ బంధించబడిన పాదాలు.

అలసిన శరీరం — బరువుగా నీటిలో మునిగిపోసాగింది.

దమ్ము ఆరిపోయిన ఊపిరినిత్తులు శ్వాసకోశం కొట్టుకులాడ సాగాయి - శక్తినంతా కూడ దీసికొని. బలంగా విడిపించుకొన్నాడు. మరింత బలంగా బంధించివేసింది తీగె - జీవన్మరణస్థితిలో ప్రాణాలు కొట్టుకులాడాయి - గ్రినేడ్ స్థితిలోకి మార్చుకుంటూ నీటిలో మునిగి పోతూన్న అతను గావుకేక పెట్టాడు,

"ఇదిగో - దీన్ని పట్టుకో దీన్ని పట్టుకో" - అలలపై తేలి వస్తూన్న శబ్దంతోపాటు పొడుగాటి తాడు సొరంగంనుండి వచ్చిపడింది. ఆతురతతో దాన్ని లంకించుకొని మోచేతికి చుట్టుకొని నీటిపై నిలబడి పొయ్యాడు తనను బంధించివేస్తూన్న నీటి తీగె సంకెళ్ళను విడిపించుకొని నీళ్ళను సర్రునకోసికొంటు సొరంగం చేశాడు.

అంతా చీకటి - సూర్యరశ్మి చొరరాని చరియలు.

పాకుడుపట్టిన బండలు కాలిని ఆననీయటంలేదు -

చలికి గడగడలాడుతూ - నీరుకారుతున్న తల పైకెత్తి పైకి లాగ మన్నట్లు చూపులు ప్రసరింపచేశాడు,

"బైనాక్యులర్స్" కళ్ళకు అడ్డంపెట్టుకొన్న మానవుడు.

అతని దుస్తులపై చిహ్నాలు కలవరపెట్టాయి. విస్ఫారిత నేత్రాలతో తదేకంగా చూశాడు. శరీరం భయంతో కంపించిపోయింది.

అంతే !

కెవ్వున కేకవేసి నీళ్ళలో పడిపొయ్యాడు.

"భయపడకు తమ్ముడూ ! - నే నేం చెయ్యనురా , ... మునిగి పోతావా...నా మాటనమ్ము ... రా...నేను పైకిలాగుతా" ... సాదరమైన పిలుపు - ఎద తలుపులుతెరచి రమ్మన్నట్లు.

అతని గుండెల్లో దడదడ - అనుమానంగా కళ్ళు తిప్పి చూస్తు మళ్ళీ త్రాటిని ఆశ్రయించాడు.

గట్టిగా పట్టుకొన్నావా? ... లాగుతున్నాను పైకి - మరి" ... రెండు అరచేతులతోనూ గట్టిగా పట్టుకొని మోచేతులవరకూ మెలివేసి కొన్నాడు. ఒక్కొక్క అంగుళమే తాడుచుట్టను కోసుకుంటూ, రాసు కుంటూ ఆ చీకటిగుహలోకి పోసాగింది. పైకివచ్చాక అతను లోపల నుండి చేయూతనిచ్చాడు.

ముందుకు తూలి పడబోయ్యాడు.

అతను గట్టిగా పొదవి పట్టుకొని బండపై పరుండబెట్టాడు -అతని అతనిఅరచేతులపై తాడు చుట్టుకొన్న అరపడి-ఎర్రగా కందిపోయింది - చుట్టు చుట్టుగా - శరీరం నీరు విడువసాగింది. కళ్ళు మూతలుపడి పొయ్యాయి - ఆయాసంతో ఛాతి ఎగసిపడసాగింది.

ఓ అర్ధగంటకాలం అలా జీవచ్ఛవంలాపడివుండి మెల్లగా కళ్ళు విప్పి చూశాడు.

ఎదురుగా అతను - ఉన్ని బురఖా శరీరంనిండా దిగవేసికొని - ఎలుగ్గొడ్డులా - మెల్లగా రెండు చేతులూ ఛాతిపై చేర్చుకొని జోడించాడు-కళ్ళతో నింపుకొన్న కృతజ్ఞతతో.

"తప్పు - తమ్ముడూ".. చిరునవ్వుతో ముకుళిత హస్తాలను వేరు చేశాడు.

"నీ పేరు"...అతనడిగాడు.

"శ్రీరామ్" గొంతు వణికింది - పైన మంచు పేరుకోవటాన గుహ ఇగంలా ఉంది.

"మీ ఊరు"...

"హైద్రాబాద్"...

తడి ఆరిపోయిన శరీరంపై వెంట్రుకలు సూదుల్లా నిక్క పొడుచుకున్నాయి, గూడలు కప్పుకొని మునగదీసికొని కూర్చు న్నాడు-సమాధానం చెప్తూ.

"ఏహ్వో"...అతని కళ్ళలో కొత్తవెలుగు జిమ్మింది. కనుబొమలు విల్లులా పైకి లేచాయి.

"నిన్ను చూస్తుంటే మళ్ళీ హైద్రాబాద్ చూస్తున్నట్లే వుంది. అయితే నీవు హైద్రాబాద్ వాడివన్నమాట...చాలా సంతోషం" అతని కనుపాపల్లో గత జీవితపు స్మృతుల అలలు - ఆ అలలపై తేలిపోతూన్న మనస్సు - జ్ఞాపకాల పిచ్చి తీగెవలలో చిక్కుబడిపోయిన మనస్సు విలవిలలాడిపోయింది_ముఖం మ్లానమయిపోయింది.

"మేం అక్కడ్నించి పారిపోయిరావటం _ చాలా పొరపాటయిపోయింది భాయ్ - ఎంతో ఆస్తిపాస్తులు నష్టపరచుకొని ఇంతదూరం పరుగెత్తుకొచ్చి ఇక్కడ మేం పొముకొన్నదేమీ లేదు...ఆ నరుక్కోవటం ఆ చంపుకోవటం - ఏమిటో యార్...ఆ రోజులు జ్ఞాపకం తెచ్చుకోకపోవటమే మంచిది."

కళ్ళు జలజలలాడాయి.

నిశ్చలమైన గాజు కళ్ళలో అతని గుండె.

గుండెలో గూడుకట్టుకొన్న జన్మభూమి.

స్మృతులు - వ్యథాపూరిత గాథలు కుష్టురోగంలా పైకి కనిపించకుండ కొరుక్కుతింటున్నాయి.

"నీవు త్వరగా ఇక్కడ్నించి పారిపో...మావాళ్ళు ... నీకోసం గాలిస్తున్నారు. త్వరగా పారిపో, లేకపోతే చచ్చిపోతావ్"...ఏదో జ్ఞాపకం వచ్చిన వాడులా ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు - భయంతో కంపించిపోతూ తాను పైకి తెచ్చిన గ్రినేడ్ అందుకున్నాడు - ఆ గుహనుండి క్రిందకు ఉరికిపోటానికి ఉద్యమిస్తూ - అతను-

"చచ్చిపోటానికి...చంపటానికే కదా మన మిక్కడికి వచ్చింది... మన వృత్తి అది...ఇంకా భయమెందుకు...నీవు త్వరగా పో...ఈపాటికి మీ కమాండర్ నీపై కారాలూ మిరియాలూ నూరుతూండవచ్చు."

మళ్ళీ నిశ్శబ్దం - తిరిగి శరీరం బిక్కు బిక్కుమంటూ ప్రాకసాగింది - తన తుపాకీ - తోటాలు ఎదురుచూస్తున్నాయి తన కొరకు. ధైర్యం చోటు చేసికొంది అతనిలో. గబ గబా నెత్తిపై ఉక్కుటోపీ తగిలించుకొని బూట్లశబ్దం చెయ్యకుండా మునిగాళ్ళపై పరుగెత్తాడు - లోయలకు అడ్డంగా పడి.

కొండలు బ్రద్దలయినట్లు పేలుడు - భగ్గున మంటలు-పొగ.

శరీరం కంపించిపోయింది. కందకంలో దూకి తుపాకి ఎక్కుపెట్టి నలువైపులా చూశాడు. సైనికులు పరుగెత్తుతున్న సవ్వడి దూరమయిపోయింది. భయంకరమైన నిశ్శబ్దత-ప్రాణాలు అరచేత బట్టుకొని వానపాములా ప్రాకుతూ మెల్లమెల్లగా శిబిరం చేరాడు వగరుస్తూ.

దేరాలన్నీ నిశబ్దంగా ఉన్నాయి.

సుప్రసన్న వదనం-

నిర్భయమైన - నిశ్చలమైన చూపులు - ఆ నయనాంతాల్లో ఏదో కలత-పెదవిపై ఎండిపోయిన చిరునవ్వు-

కొండల గుండెలు పగిలినట్లు తుపాకులు పేలాయి - దూరానకు కోనేరు అవల-బల్లులవలే బండను కరచిపట్టుకొని మెల్లగా చెరొకవైపు - పొట్టతో ప్రాకసాగారు. నిరాయుధుడైన అతను మెల్లగా తుపాకివైపు దేకసాగాడు. ఆ పొదల మాటున గుళ్ళు దూసుకుపొయ్యాయి. ఊపిరి బిగపట్టుకొని స్తంభించిపోయింది శరీరం.

కమాండెర్ గుడారం తెరవత్తెలిగించి ఒక శాల్యూట్ కొట్టాడు అతను. గీతలు గీతలుగా ఉన్న పటంలో గుర్తులు పెట్టుకొంటూన్న కమాండర్ తల పైకెత్తి చూశాడు.

అలసిపోయి దుమ్ముకొట్టుపోయిన ముఖం.కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా మెరుస్తున్నాయి. మోకాళ్ళు కొట్టుకుపోయి బొడలయ్యాయి. అక్కడచిరిగి పిప్పి - పిప్పయిపోయిన పంట్లాం నెత్తురోడుస్తోంది.

"నీ వెళ్ళి పడుకో'' - కమాండర్ కంఠంలో జాలి.

పచ్చిపుండ్లులా తయారైన మోకాటిచిప్పలు జిమ్మని లాగాయి. "ఉఫ్ - ఉఫ్''ని ఊదుకోసాగాడు పక్కపై కూర్చొని. గుండెల్లో ఏదో గుబులు గుబులుగా అనిపించింది - కళ్ళముందు మానవ రుధిరంతో తడిసి నట్లు ఎఱ్ఱటి రణభూమి.

ఇరుపక్షాల సైన్యాలూ గత వారంరోజులుగా అక్కడ మోహరించి ఉన్నాయి. తన స్థావరంపై ఒక్కబాంబు పడితే చాలు - కాకులు రాలి నట్లు ఎక్కడివా ళ్ళక్కడ నేలకొరుగుతారు.

"అప్పుడు - తను ?"

"తనుకూడా ... ... అతని హృదయం లోలోన - మృత్యువు-రోడ్డురోలర్ చదును చేసినట్లు అందర్నీ చదునుచేసి పారవేస్తుంది - అంతే !

"తను చచ్చిపోతే - తను చచ్చిపోతే" ... గుండె గుసగుస లాడింది. చచ్చినవాళ్ళపేరిట చౌరస్తాలో ఒక శిలాస్థూపం-అప్పుడప్పుడూ ఒక గ్రద్ద మాంసపు ముక్కను తన్నుకొచ్చి ఆ అమరవీరుల స్మారక చిహ్నంపై నిర్భయంగా కూర్చుని తింటుంది. అంతకు మినహా ఏమీ లేదు.

బాధగా - భయంగా కళ్ళు మూసికొని వెల్లికిలా పడుకొన్నాడు - కణతలనుండి బొట్లు బొట్లుగా జారిన కన్నీరు చెవుల్లోకి దిగిపోసాగింది. కన్న తల్లిదండ్రులు కడుపులో చిచ్చుపెట్టి, కట్టుకున్న భార్యల నల్లపూసలు గంగలోకలిపి, తమదారి తాము చూసుకొన్న ఎందరో అభాగ్యులు కళ్ళ ముందు దిరుగసాగారు.

బిల బిలమంటూ సైనికులు వస్తున్న ధ్వని - కేకలు - గందర గోళం.

మగతగా అంటుకొంటూన్న కనురెప్పలు విప్పాడు.

"వాడి అంతు కనుకున్నాం ... లేకపోతే మన సరిహద్దుల్లో తారట్లాడతాడా ... కమాన్ ... చూద్దువుగాని రా ..." లోనికి తోసుకు వచ్చిన సైనికుడు గసబోసికొంటూ చెప్పుకుపోసాగాడు.

మైకంలోనుండి తేరుకుంటున్నట్లు అదోలాచూశాడు. లేవటానికి ప్రయత్నించాడు. కలుక్కుమన్నాయి మోకాటిచిప్పలు - ఎదుటివ్యక్తి ఆసరాతో లేచి అటు నడిచాడు - సైనికు లందరూ సమకూడి కేకలు పెడుతున్నారు - అందరి ముఖాల్లోనూ గర్వంతోకూడిన ఆనందం - తనను చూసి ప్రక్కకు తిప్పుకున్నాడు.

నెత్తురు మడుగులో గిలగిలలాడుతూన్న మానవశరీరం-గుండెల్లో గుండా గుళ్ళు దూసుకుపోయి రక్తంస్రవిస్తూన్న ఛాతి - నెత్తురుతో ఎండి అంట్లుకట్టుకుపోయిన తల - కనురెప్పవేయక నిశ్చలంగా చూస్తున్న గాజుకళ్ళు -- పెదవులపై ఎండిపోయిన చిరునవ్వు. నీవు లేచిన వేళ మంచి దీ రోజు - వీడుకూడ ఆ కోనేటిదగ్గరే మసులుతున్నాడు - ఒక్క బులెట్ షాట్‌తో గింగిరాలు తిరిగి క్రిందబడ్డాడు''... అతిశయంతో పలుకుతున్న పెదవులు.

గుండెలు పిండుతూన్న ఆ దృశ్యం చూడలేక కనురెప్పలు వాలిపోయాయి. ఆ మాటలు పలుకుతూన్న మానవుల ముఖాల్లోకి చూడలేక కళ్ళు ప్రక్కకు తిప్పుకున్నాడు.

దూరాన మంచు నీరై ప్రవహించసాగింది.

V. R. LIBRARY
Narayanguda
HYDERABAD-29

795

V. R. LIBRARY
Book No ...103...